ఇష్ట దైవం.. నిష్ట ఆచారం!

- మహిమాన్వితుడు ఉరుకుంద ఈరన్న స్వామి
- శ్రావణమాసంలో నియమనిష్టలతో భక్తుల పూజలు
- నెలరోజుల పాటు మాంసం, మద్యానికి దూరం
- సోమ, గురు, శనివారాల్లో ప్రతి ఇంట్లో పరమాన్నంతో నైవేద్యం


ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం

మంత్రాలయం: భక్తకోటి ఇలదైవం శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి. నిరాకారుడిగా ప్రశాంత వాతావరణంలో వెలసిన స్వామి మహిమాన్వితుడిగా ప్రసిద్ధి. అంతకు మించి వేరీ పవర్‌ఫుల్ గాడ్‌గా ప్రఖ్యాతి. స్వామి మొక్కు తీర్చకపోయినా.. పవిత్రత పాటించకపోయినా.. నియమ నిష్టలు విడనాడినా స్వామి శిక్ష అనుభవించక తప్పదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. నెల పాటు ఎంతో నియమ నిష్టలతో ఆచారం పాటించడం ఆనవాయితీగా వస్తోంది.

నెలరోజుల పాటు శ్రావణమాస ఉత్సవాలు..
మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం ఉరుకుంద గ్రామ సమీపంలో విశాల ప్రశాంత వాతావరణంలో శ్రీ నారసింహ ఈరన్న స్వామి కొలువుదీరారు. వీరభద్రస్వామి అంశగా.. నిరాకారుడిగా.. అశ్వర్థవృక్షం ఆదిలో వెలిశారు. మహిమలతో భక్తకోటి ఇలవేల్పుగా వర్ధిల్లుతున్నారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ స్వామి భక్తులు ఉన్నారు. శ్రావణమాసంలో నెల రోజుల పాటు స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఏటా శ్రావణ మాసంలో 15 లక్షల మంది భక్తుల క్షేత్రాన్ని సందర్శిస్తుంటారు.

పరమ నిష్టల నియమావళి
- శ్రావణమాసాన్ని స్వామి నెలగా భావించి భక్తులు ఎంతో నిష్టగా ఆచారాలు పాటిస్తారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆధ్యాత్మిక చింతనలో నడుచుకుంటారు.
- స్వామిని కొలిచే భక్తులు ఇళ్లలో మాంసం వంటకాలు చేయడం, మద్యం సేవించడం తదితర అలవాట్లకు దూరంగా మెలుగుతారు.
- ప్రతి సోమ, గురు, వారాల్లో ఇళ్లలో పరమాన్నంతో నైవేద్యం పెట్టి ఇంటి కొకరు ఉపవాస దీక్ష బూనుతారు.
- ఎంత దూరంలో ఉన్నా.. స్వామికి బియ్యం, బేడలు, బెల్లం సమర్పించుకుంటారు.
- మొక్కు ఉన్న భక్తులు మాత్రం స్వామి క్షేత్రంలో మొక్కును బట్టి రాత్రి బస చేసి భక్షాలు, పాయసం వంటకాలు చేసి నైవేద్యంతో విశిష్ట పూజలు చేసుకుంటారు.
- ఆచారంలో భాగంగా ఇంటికొకరు లేదా ముగ్గురు తలనీలాలు కచ్చితంగా ఇచ్చుకుంటారు.
- ఈ నెలలో నాగుపాములను కొట్టడంగానీ, చంపడం గానీ చేయరు.
- ఇంటి దైవంగా తమ పిల్లలకు పుట్టు వెంట్రుకలు ఇక్కడే సమర్పిస్తారు.
- సాధారణ రోజుల్లో వంట పాత్రల్లో కాకుండా కొత్త పాత్రల్లోనే వంటలు చేసుకుంటారు.
- శ్రావణ శుక్రవారం నోములు నోయడంలో ఆడపడచులు నిష్ట పాటిస్తారు.
- నాగుల చవితిని పురస్కరించుకుని నూతన దంపతులు పెళ్లి దుస్తులతో వెళ్లి నాగులకట్టకు పాలతో అభిషేకం చేస్తారు.
- స్వామి నీడ సోకినా.. ప్రసాదం స్వీకరించినా.. తమను స్వామి వదలరని ఇతరులు ప్రసాదాలు తీసుకోరు.
- కొందరు వాహనదారులు సైతం క్షేత్రానికి బాడుగలు వెళ్లాలన్నా వెనకడుగు వేస్తారు.
- కులమతాలకు అతీతంగా ఇతర మతస్తులూ స్వామిని కొలవడం, నైవేద్యాలు సమర్పించడం ఇక్కడ చూస్తాం.
- ఇళ్లలో పటాలతోపాటు పూర్ణకుంభం పెట్టి పూజలు చేస్తారు. స్వామి హారంగా జంజివరం (వెండిదండ) ప్రతి ఇంటిలో మహిళలు ధరిస్తారు.


ఈరన్నస్వామి మూల విరాట్

- పొలాల్లో విత్తు వేసే ముందు స్వామి చెంత కొన్ని విత్తనాలకు పూజ చేసుకున్నాకే విత్తు వేయడం ఆనవాయితీ.
- ఇళ్లలో శుభకార్యం ఉందంటే కచ్చితంగా పెళ్లి పత్రికలు తీసుకెళ్లి పూజలు చేసిన తర్వాతే బంధు మిత్రులకు ఆహ్వాన పత్రికలు పంచుతారు.
- ఊరూర వెలసిన నరసప్ప, లక్ష్మినరసింహా, శివాలయాల్లో వారం వారం నైవేద్యాలతో పూజలు చేసుకుంటారు.
- నాగుల పుట్టినిల్లుగా పుట్టలకు ఇక్కడ పాలు పోయడం, పూజలు చేయడం వంటివి చేస్తారు.
- స్వామికి గుర్తుగా నేటికీ ఉరకుంద, ఈరన్న, నరసింహ, వీరేష్ నామాలతో పేర్లు పెట్టుకుంటారు. పేర్లు మారినా కనీసం ఉ, న,వీ, ఈ అక్షరంతో పేరు మొదలయ్యేలా చూసుకోవడం ఆచారం.
- స్వామి క్షేత్రం దర్శించాలంటేనే ఎంతో మంది వెనకడుగు వేస్తున్న సందర్భాలు కోకొల్లలు.

ఇలా ఉరకుంద ఈరన్న స్వామి ఆచారాలు తూచ పాటిస్తూ నెలంతా ఎంతో నిష్టగా గడుపుతారు. ఏ పొరపాటు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. కష్టమైనా ఎంతో ఇష్టంగా ఆచారాలు పాటించడం ఆనవాయితీగా వస్తోంది.

క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి


సీఐ శ్రీరామ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు నూతన సీఐ శ్రీరామ్ కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక స్వచ్ఛంద సంస్థ, జనసేవా స్వచ్ఛంద సేవా సంస్థ, నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ ఆఫ్ ఇండియా సభ్యులు కోరారు. మంగళవారం వారు స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీరామ్‌ను కలిసి శాలువా, మెమోంటోను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. హరిప్రసాద్‌యాదవ్, అధ్యక్షుడు విరుపాక్షి స్వామి, నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ ఆఫ్ ఇండియా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ


విద్యార్థులతో కనక టీం సభ్యులు, ఉపాధ్యాయులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు మంగళవారం కనక టీం సభ్యులు, సీనియర్ క్రీడాకారులు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కనక టీం సభ్యులు, సీనియర్ క్రీడాకారులు నాగరాజు, వెంకటేష్, వీరేష్, గొల్ల వీరేష్, భాస్కర్, శ్రీకాంత్, సోము మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇందిరాదేవీ, రిటైర్డ్ హెచ్‌ఎం రాము, పీడీ రామన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌతాళంలో వర్షం


జలమయమైన వైఎస్సార్ నగర్‌లోని రోడ్డు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. నెల నుంచి వర్షంలేక అల్లాడిపోతున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. గ్రామంలోని ప్రధాన విదులన్నీ జలమయమయ్యాయి. వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై నుంచి వర్షం నీరు పారాయి. మంచాల్‌వీధి, వైఎస్సార్ కాలనీ, జేకేఎల్ఎస్ నగర్‌లలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరాయి. గంటకు పైగా వర్షం కురిసింది.

నిందితులను కఠినంగా శిక్షించాలి


రఘురాముడు

పెద్దకడబూరు: మంత్రాలయం నియోజకవర్గం మాధవరం పరిధిలోని రచ్చమర్రి గ్రామ సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్‌లో పదవ తరగతి విద్యార్థిని పార్వతి ఆత్మహత్యపై పూర్తిగా విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీపీ రఘురాముడు డిమాండ్ చేశాడు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందా లేక ఎవరైనా హత్య చేశారా అన్న కోణంలో అధికారులు విచారణ చేయాలన్నారు. మృతి చెందిన పార్వతి కుటుంబానికి రూ. 20లక్షలు పరిహారంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి సహకరించండి

ఆదోని అర్బన్: పట్టణంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి సహకరించాలని ఆదోని గ్రంథాలయ అధికారిణి సుజాత కోరారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు భవన నిర్మాణంపై ఎమ్మెల్యేతో చర్చించినట్లు ఆమె తెలిపారు. త్వరలోనే నిర్మాణం పనులు చేపట్టేలా చర్యలు తీకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు.

డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం పరిశీలన

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరికి చెందిన కావలి చిన్న నరసన్న (52) తన పొలంలో అనుమానస్పదంగా మృతి చెందడాన్ని సోమవారం గుర్తించారు. దీనిపై ఆస్పరి సీఐ హనుమంతప్ప డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం కర్నూలు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్‌తో ఏఎస్ఐ పురుషోత్తం పొలం పరిసరాలను పరిశీలించారు. క్లూస్‌టీం ఇన్‌చార్జ్ షేక్ అన్వర్ పొలంలో మట్టి నమూనాలను సేకరించారు. నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించేందుకు తీసుకెళ్లినట్లు సీఐ తెలిపారు.

వర్షం కోసం 15 రోజుల ఉపవాస దీక్ష

ఆదోని అర్బన్: వరుణదేవుడు కరునించి ఆదోని ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురవాలని బుధవారం నుంచి 15 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మత గురువులతో కలిసి వరుణదేవుడు కరుణించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు పడాలని అన్ని ఆలయాల్లో, మసీదుల్లో, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మత గురువులు దత్తాత్రేయశర్మ, జగదీశ్వర, పంచాక్షరయ్య, హాజీ హతీఫ్, ఖతీఫ్, ఆనందరాజ్, ఎజ్రా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం


మద్యాన్ని ట్రాక్టర్‌తో ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని మంగళవారం సాయంత్రం ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేయించినట్లు సెబ్ ఏఈఎస్ వినోద్‌కుమార్, సీఐ విన్నీలత తెలిపారు. స్థానిక ఇస్వీ రోడ్డులోని రైల్వే బ్రిడ్జి వద్ద మొత్తం 37 కేసుల్లో సుమారు రూ.3.50 లక్షలు విలువ చేసే 476 లీటర్ల కర్ణాటక మద్యం, 108 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశామన్నారు. అక్రమంగా కర్ణాటక మద్యం, నాటుసారా తయారీ లేదా సరఫరా చేసినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామన్నారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత

ఎమ్మిగనూరురూరల్: పంటల సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఆత్మ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత, కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఏ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.నరసింహులు, డా. కె.సతీష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రాఘవేంద్రచౌదరి ఆధ్వర్యంలో రైతులు–శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షాధార పత్తిలో 19.19.19 3గ్రాములు 1 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే బెట్టను తట్టుకునే అవకాశం ఉందని తెలిపారు. నూతన సాంకేతి పద్ధతులకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసుకొని సాగుచేసుకోవాలన్నారు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచేల చూడాలని సూచించారు. చిరుధాన్య పంటల్లో కొర్రలో సూర్య నంది, గరుద రకాలు, సజ్జలో ఏబీవీ–04, ధనశక్తి రకాలు మంచివని చెప్పారు. కందుల్లో కొర్రలు అంతర పంటగా వేసుకుంటే రైతుకు నికర లాభాం ఎక్కువగా వస్తుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. నిరంజన్, డా. మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ– క్రాప్ నమోదు చేయించుకోవాలి


ఈ– క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి

ఆదోని రూరల్: పంటలను సాగు చేసిన ప్రతి రైతు ఈ– క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని నారాయణపురం, చాగి, బసాపురం గ్రామాల్లో ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు ఇన్సూరెన్స్, మద్దతు ధర లభిస్తాయన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్‌లతో దగ్గరలోని రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

పత్తిలో చీడపీడలను నివారించుకోవాలి
పత్తి పంటలో చీడపీడల నివారణకు డైఫెన్‌థియూరాన్ 1.2 గ్రాములు లేదా ఫ్లోనోకామిడ్ 0.3 గ్రాములు లేదా థైమెథాక్సామ్ 0.3 గ్రాములు లీటర్ నీటిలో కలుపుకొని పంటపై పూర్తిగా తడి చేవిధంగా పిచికారీ చేయాలని ఏఓ సూచించారు. వీటితో పాటు వేపనూనెను కూడా కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. వివిధ రకాల పంటల్లో దోమల నివారణకు పసుపు, నీలం రంగు జిగురు అట్టలను ఎకరాకు 10 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని, దీంతో వాటి ఉధృతిని తగ్గించవచ్చని చెప్పారు. అలాగే పంటలను బెట్ట నుంచి కాపాడుకోవడానికి 19:19:19 పొడిని 10 గ్రామాలు లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలని సూచించారు.

బాలిక మృతిపై అనుమానాలు


మాట్లాడుతున్న ఎంకే రంగస్వామి

కర్నూలు(అర్బన్): మంత్రాలయం మండలం రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థిని కురువ పార్వతిది ముమ్మాటికి హత్యేనని జిల్లా కురువ సంఘం నేతలు ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ.. బాలిక శరీరంపై గాయాలున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గదిలో ఫ్యాన్ బాలికకు అందే పరిస్థితి లేకపోయినా ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాలిక తల్లిదండ్రులకు ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు బూడురు లక్ష్మన్న, కొత్తపల్లి దేవేంద్రం, మల్లికార్జున, వీరనాగప్ప తదితరులు ఉన్నారు.

వర్షం కోసం తుంగాజలంతో పూజలు


తుంగభద్ర జలాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్తులు

పెద్దకడబూరు : వరుణుడు కరుణించి వర్షాలు కురవాలని మండల కేంద్రానికి చెందిన ప్రజలు మంగళవారం తుంగాజలాలతో ఆలయాల్లో పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తుంగభద్ర నదికి పాదయాత్రగా వెళ్లి స్నానమాచరించి ప్రత్యేక పూజలు చేసి రెండు బిందెలతో నదీజలాన్ని తీసుకొచ్చారు. ఉదయం అర్చకులు విశ్వబ్రాహ్మణ శివప్రసాద్ ఆచారి, వినోద్‌కుమార్ ఆచారి గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలతో కలసి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొని వచ్చి పెద్ద లక్ష్మమ్మవ్వ, చిన్న లక్ష్మమ్మవ్వ, మారెమ్మవ్వలకు తుంగాజలంతో పూజలు చేశారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయ అర్చకులు విశ్వబ్రాహ్మణ నరసింహాచారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కమిటీ ఎన్నిక

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అధ్వర్యంలో మంగళవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఇందులో ఆదోని పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడిగా సూరి, పట్టణ కార్యదర్శి గౌస్, పట్టణ ఉపాధ్యక్షులు శశిధర్, నాగరాజు, పట్టణ సహాయ కార్యదర్శులుగా భరత్ కుమార్, లోకేష్, వెంకట్ కమిటీ సభ్యులుగా 10 మందిని ఎన్నుకున్నారు.

వాచ్‌మన్, అటెండర్ పోస్టులు భర్తీ చేయండి

కోసిగి: రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న వాచ్‌మన్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, కోసిగి మండల వీఆర్ఏల సంఘం నాయకులు ప్రభాకర్, హనుమంతు, రాజు, వీరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం వీఆర్ఏలకు అవకాశం కల్పించాలని కోరారు. అనధికారికంగా వీఆర్ఏలు వాచ్‌మెన్ డ్యూటీలను చేయడం వలన చితికి పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అర్‌అర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని జైభీమ్ నాయకులు సాయిరామ్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 998 మంది విద్యార్థులకు గాను నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యాభివృద్ధి కుంటు పడే అవకాశం ఉందన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆదోని రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ సీనియర్ నాయకులు కె.లక్ష్మిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటయిన కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలకు తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు తదితర సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. సీపీఐ నాయకులు లక్ష్మిరెడ్డి, గొల్ల హనుమంతు, సిద్దలింగ తదితరులు పాల్గొన్నారు.

వలస వెళ్లొద్దు.. పనులు కల్పిస్తాం


ఉపాధి కూలీలు, గ్రామస్తులతో మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

పెద్దకడబూరు: ఉపాధి కూలీలు, రైతులు, ప్రజలు ఎవరూ వలసలు వెళ్లవద్దని.. ఉన్న ప్రదేశంలోనే పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం –2లో ఎంపీడీఓ జానార్దన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధి కూలీలు, రైతులు, గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సూచించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ. 300ల చొప్పున వేతనం పడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వలసలు వెళ్లకుండా ఉన్న గ్రామాలలో ప్రతి ఒక్కరూ పనులకు వెళ్లాలన్నారు. అదేవిధంగా 5ఎకరాలలోపు పొలం ఉన్న రైతులు పండ్ల మొక్కలను పెంచుకోవాలన్నారు. తద్వారా అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. చదువుకున్న యువతీ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేఈ ఖాదర్, సీటీఏ గిడ్డయ్య, టీఏ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన


డీపీ షట్టర్‌నుపైకి తీస్తున్న రైతులు, సిబ్బంది

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువ నీరు తమ పంట పొలాలకు రావడం లేదంటూ రైతులు మంగళవారం కౌతాళం మేజర్ డిస్ట్రిబ్యూటరీ వద్ద ప్రధాన ఎల్ఎల్‌సీ కాలువపై ఆందోళనకు దిగారు. తమకు 16 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉందన్నారు. అయితే డీపీ వద్ద ఏర్పాటు చేసిన షట్టర్‌ను 40 రింగుల వరకు పైకి ఎత్తాల్సి ఉండగా కేవలం 10 రింగులు మాత్రమే ఎత్తి కాలువకు నీరు వదిలారని, తమ పంట పొలాలకు సాగునీరు ఎలా అందుతాయని కౌతాళం, రాజనగర్ క్యాంపు రైతులు ప్రశ్నించారు. అక్కడికి వచ్చిన సూపర్‌వైజర్ పీర్‌సాబ్, సిబ్బందితో వాగ్వావాదానికి దిగారు. దీంతో సూపర్‌వైజర్ డీపీ షట్టర్‌ను 40 రింగుల వరకు తమ సిబ్బందితో తీయించారు. చివరి ఆయకట్టు పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందే వరకు తమ డిస్ట్రిబ్యూటరీ కాలువకు సాగునీరు రావాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని రైతులు రఘు, చిన్నరాజు, గురుస్వామి, లింగన్న, ఈరన్న, గుజ్జుల సిద్ధయ్య, ఖాదర్ లింగ తదితరులు హెచ్చరించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- 55 ప్రభుత్వ పాఠశాలల్లో రేపే ఎన్నికలు
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్


గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

గోనెగండ్ల: స్కూల్ మేనేజ్‌మెంట్(ఎస్ఎంసీ) ఎన్నికలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. 8వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆ శాఖ అధికారులు ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పాఠశాలల్లో ప్రభుత్వ నిధుల వినియోగం పై తల్లిదండ్రులను భాగస్వామ్యం కోసం ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తుంది. మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ పాఠశాలలు 55 ఉండగా 10,691 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఎన్నికల నిర్వహణ ఇలా..
ఎస్ఎంసీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులుగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉంటారు. ఓటర్లుగా విద్యార్థుల తల్లిదండ్రులుంటారు. కమిటీ చైర్మన్‌గా ఒకరు, వైస్ చైర్మన్‌గా ఇద్దరు ఉంటారు. కో–ఆప్టెడ్ సభ్యులుగా విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, పూర్వ విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. అదే విధంగా ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఏఎన్ఎం, మహిళా సమాఖ్య సభ్యులను ఎన్నుకుంటారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 15 మంది సభ్యులు, ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు 24 మంది, ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 15 మంది సభ్యులను ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకుంటారు. తర్వాత వారు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుని అదే రోజు మధ్యాహ్నం తొలి సమావేశం నిర్వహిస్తారు. కమిటీ సభ్యుల ఎన్నికను చేతులు ఎత్తే విధానంలో నిర్వహిస్తారు. కమిటీని ఎన్నుకునే సభ్యులు ఈ పద్ధతిని అభ్యంతరం తెలిపితే రహస్య ఓటింగ్ జరుపుతామని విద్యాధికారులు వెల్లడించారు.

ముమ్మరంగా పూడికతీత పనులు


న్యూ శిల్పా కాలనీలో డ్రైనేజీలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రధాన మురుగు కాలువలతో పాటు వీధుల్లోని డ్రైనేజీల్లో పూడిక తీత పనులను మున్సిపల్ అధికారులు ముమ్మరం చేశారు. కొన్నేళ్ల నుంచి ప్రధాన కాలువల్లో పూడిక పేరుకొని పోవడంతో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని పూడిక తీత పనులను చేయిస్తున్నారు. మంగళవారం స్థానిక న్యూశిల్పా కాలనీ నుంచి ఎంఎస్ నగర్ వరకు ప్రధాన కాలువలో పూడిక తీత పనులను ఆయన పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. అదేవిధంగా శ్రీనివాస థియేటర్ వద్ద, సోమప్ప సర్కిల్‌లో ఈనెల 15న ప్రారంభించనున్న అన్న క్యాంటిన్‌లలో పూర్తయిన పనులను పరిశీలించారు. అనంతరం ట్యాంక్ బండ్ రోడ్డులో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈలు శరత్‌చంద్ర, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలో వెలసిన శ్రీ రణమండల ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లే దారిలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ కోరారు. మంగళవారం పురపాలక కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. శ్రావణ మాసం కావడంతో భక్తులు తెల్లవారు జామున 4 గంటలకే ఆలయానికి వెళ్తారని, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మారుతీ రావు, సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.